# తెలియని విలువలు

గంగన్న మంచి కరాఖండి మనిషి. మొహమాటం మాటలు అతనికి పనికిరావు. రత్తయ్యగారి పాలేరుగా వుంటున్న అతనంటే రత్తయ్య కున్నంత విలువ వుంది.

మనిషి కూడా నిండుగా, గంభీరంగా వుంటాడు. ఆజాను బాహుడు.

యజమానికి గంగన్న కుడి భుజం. పొలం పనిమీద పెత్తనం అంతా గంగన్నదే.

రత్తయ్య అప్పుడప్పుడు అవసరపడ్డవాళ్ళకి పాతిక, యాభై చేబదులు ఇస్తుంటాడు. పెద్దగా వడ్డీకి ఆశపడకపోయినా, అన్ననాటికి మాత్రం డబ్బు ఇవ్వవలసిందే. అందుకనే వూళ్ళో ఎవరన్నా సొమ్ము అప్పు తీసుకున్నప్పుడు ఇవ్వవలసిన తేదీకి ఇచ్చి వేస్తుంటారు.

ఎవరన్నా యివ్వకపోతే ఒకటి రెండుసార్లు చిన్నపాలేరును పంపుతాడు. అప్పటికి సొమ్ము రాకపోతే ఆ మాట గంగన్నతో చెపుతాడు. గంగన్నను చూడగానే అవతలివాళ్ళు డబ్బు చేతులో పెట్టేస్తారు.

ముందుగా అడిగి చూస్తాడు గంగన్న. ప్రయోజనం కన్పించక పోతే ఆ సొమ్ముకు సరిపడ్డదేదో తెచ్చి యజమానికి అప్పగిస్తాడు. అక్కడ మాత్రం సామాన్యంగా తటాపటాయించడు. అతని మనసులో ఎంతబాధగా వుంటుందో తెలియదు. అంతా ప్రభుభక్తితో చేస్తాడు. అతని మాటలు ఎప్పుడూ పరుషంగా వుండవు. అసలు గంగన్నకు కావలసింది పని - మాటలుకాదు.

ఒకనాడు యజమాని గంగన్నతో "చూడు గంగన్నా! మన పంతులు శంకరంగారు డబ్బు ఇవ్వాలోయ్. పాతిక పట్టుకెళ్ళాడు. రెండుసార్లు కబురు పెట్టాను. ఇచ్చే జాడేమీలేదు. ఒకసారి కనుక్కురా" అని చెప్పాడు.

"చిత్తం బాబయ్యా.... కనుక్కొస్తానండి అన్నాడు గంగన్న.

చెయ్యి తీరుబడి అయ్యాక గంగన్న శంకరం పంతులింటికి బయలుదేరాడు.

అల్లంత దూరంలోనే చూశాడు శంకరం ఆయన గుండెల్లో రాయిపడింది. చాలామందిని అడుగుతూనే వున్నాడు. కాని అందరూ లేదంటే లేదంటున్నారు. తనకు మూడుమాసాల నుంచీ జీతం రావడం లేదు. అప్పుల పైన అప్పులు చేశాడు. వీలైనచోటల్లా అప్పు చేశాడు ఆపాత అప్పులు తీరితేనేగాని కొత్తవి పుట్టవు.

"దండాలండి బాబయ్యా!" అని నమస్కరించాడు గంగన్న.

శంకరం వెలాతెలాబోతూ "రా గంగన్న" అన్నాడు తడిఆరిన గొంతుతో.

"పనుందండి-త్వరగా పోవాలి" అన్నాడు గంగన్న.

"వస్తానుండు. అలా అరుగుమీద కూర్చో అని చెప్పి శంకరం పంతులు ఇంట్లోకి వెళ్ళాడు.

శంకరం భార్య శాంతమ్మ అప్పుడే గంగన్న రాకగురించి తెలుసు కుంది. భర్త తనతో సంప్రదించడానికి వచ్చినట్లు కూడా గ్రహించింది.

ఆవిడ మంచిగుండె నిబ్బరంవున్న మనిషి. అవసర మొచ్చి నప్పుడు భర్తగుండె దిట్టపరిచే నేర్పు వుంది ఆవిడలో శంకరం చిక్కుల చీకటిలో కొట్టుమిట్టాడుతున్నప్పుడు శాంతమ్మ ఆయనకు వెలుగుదారి చూపుతుంది.

"అవును. ఆ రత్తయ్యగారు రెండుసార్లు కబురు పెట్టారు. గడువుదాటి పదిరోజులు కూడా అయింది. ఆయన సంగతి మనకు తెలియందికాదుగా!"

"ఆ బాకీ తీర్చడానికి సర్వవిధాలా ప్రయత్నం చేస్తూనే వున్నాను. కాని ససేమిరా పైసా పుట్టడంలేదు."

పోనీలెండి. అవతల గంగన్నను కూర్చో బెట్టి యిప్పుడు విచారిస్తే లాభంలేదు.

"ఆ సంగతి నిజమే. ఏదో సర్దిచెప్పడానికే నిన్నడిగేందుకు వచ్చా."

"బాగుంది!- ఇంకేం సర్దిచెప్పడమండి?"

"మరి చెప్పక యిప్పుడు చేసేదేముంది?"

"అలాగంటే ఎలా?- ఏదో చెయ్యాలి.- "ఆ డబ్బుకు తగ్గదేదో యిచ్చిపంపాలి. మన వీలుపడినప్పుడు విడిపించుకోవచ్చు."

అయ్యో రామా!- ఆమాత్రం ఆధారంవుంటే ఇంక అనుకోవడం దేనికి!.... ఇంట్లో పట్టుమని పదిరూపాయాలు ఖరీదుచేసే వస్తువే లేదాయె.... ఇక నీవంటిమీద నగల సంగతి చూద్దామా, మంగళసూత్రాలు తప్ప తక్కినవన్నీ కైంకర్యం అయిపోయాయి."

"అవన్నీ ఎందుకండి? వాటిని తలుచుకుంటూ విచారిస్తే కలిగే

లాభం ఏముంది?.... అయినా మిగిలివున్నాయని సంతోషించకూడదు! ఎంత లేదన్నా ముప్పయి రూపాయలు చేస్తాయి.

ఆమాటవిన్న శంకరం గతుక్కుమన్నాడు. మనస్సులోని బాధతో మొఖం నల్లకప్పు వేసింది.

"నువ్వనేది ఏమిటి! !.... మంగళసూత్రాలు ఇచ్చి పంపుతా నంటావా?"

"అవునండి!.... ప్రతిదానికి అంత బెంబేలు పడిపోతారెందుకు.... ఇందులో కొంపమునిగి పోయిందేముంది? ఇవ్వాళిచ్చి మర్యాద నిలబెట్టు కుంటాం.... రేపు జీతంరాగానే విడిపించుకుంటాం."

ఆవిడ ముఖంలో విషాదరేఖలు ఏమాత్రం కన్పించడం లేదు. లోలోపల బాధలు వందలుగా కలిసి పెనవేస్తూ వుండవచ్చు.

శంకరం నోటమాటరాలేదు. ఏమనడానికి తోచలేదు. అలాంటి పరిస్థితుల్లో సాధారణంగా భార్య చెప్పినదానికి ఎదురు చెప్పడు. కాని ఆమె తన మంగళసూత్రాల్నే తాకట్టుగా ఇవ్వడం సహించలేకపోయాడు.

"ఆ మంగళసూత్రాలు ఇవ్వడానికి మనసొప్పడం లేదు" ఆయన గొంతు గద్గదికమయింది. కళ్ళను నీటిపొర కప్పింది.

"ఒట్టి అమాయకులండి" అంటూ శాంతమ్మ వంటింట్లోకి నడిచింది.

శంకరం కళ్ళు తుడుచుకుని చూసేటప్పటికి శాంతమ్మ మెడకు కట్టుకున్న పసుపుకొమ్ము, చేతిలో పట్టుకున్న మంగళసూత్రాలు కలిపి కళ్ళకు అద్దుకుంటూ వస్తోంది.

ఒక కాగితంతెచ్చి దాన్లో పొట్లాం కట్టింది మంగళ సూత్రాలు.

"గంగన్న కివ్వండి. వారం పదిరోజుల్లో పైకం యిచ్చి తీసుకుం టామని చెప్పండి."

ఆయన ఆఁ వూఁ అనలేదు. చేయిచాపలేదు.

ఆమె గ్రహించింది.

"అయితే. నేనే యిస్తాలెండి."

బయట వసారాలోకి వచ్చింది.

"దండాలండి అమ్మగారు" అన్నాడు గంగన్న.

"ఇదిగో చూడుబాబు. మా వారికి జీతాలు ఇంకా అందలేదు. మీ దొరగారి దగ్గర డబ్బు తీసుకొని చాలరోజులయింది. అంతవరకు ఇది వుంచమను. జీతం రాగానే తెచ్చుకుంటాం" అని పొట్లం విప్పి చూపించి యివ్వబోయింది.

అంతవరకు అందులో ఏముందో అనుకున్నాడు గంగన్న. మంగళసూత్రాలు చూడగానే నిశ్చేష్టుడైపోయాడు.

"ఇవా అమ్మగారు!!" అన్నాడు.

తన పాదాలు తన యిష్టదైవానికి తగులుతాయేమో అనుకున్నప్పుడు భక్తుడు ఎంత భయపడతాడో అంతగా భయపడ్డాడు గంగన్న.

గంగన్నకు తల తిరిగినట్లయింది. మనస్సులో ఒకమూల కప్పు పడివున్న పుండు అమాతం కలకబారింది.

ఎన్నడు లేనిదీనాడు అతనిమాట తడబడింది. "ఉంచండమ్మా. మాదొరకి నేను చెబుతాను" అని గిరుక్కున తిరిగి చరచరా వెళ్ళిపోయాడు.

సరాసరి తన యింటి ముఖం పట్టాడు.

ఏదీకాని వేళ భర్తరావడం చూసి గంగన్న భార్య నాగమ్మ ఆశ్చర్యపోయింది.

"అదేవిటి ఇప్పుడొచ్చారు. వంట్లో బాగుండలేదా?" అని అడిగింది భర్త ముఖం అదోలా వుండడంచేత.

"కొంచెం పనుండి వచ్చాను" అని అనేసి తిన్నగా మూలగదిలోకి వెళ్ళాడు.

తలుపు నెమ్మదిగా దగ్గరేసి లోపల గడియ వేసుకున్నాడు. ఆ గదిలోవున్న కావడి పెట్లో గంగన్న డబ్బు గట్రా దాస్తుంటాడు.

నాగమ్మ భర్తవెనకాలే వెళ్ళబోయి ఆగింది డబ్బు వ్యవహారం చూసు కుంటున్నాడేమోనని. అసలు ఆ పెట్టె తీస్తున్నప్పుడు గంగన్న యింకె వర్నీ రానీయడు.

ఆ పెట్టె గంగన్నకు ప్రాణంకంటె ఎక్కువ. అందులో అడుగున చిన్న బొట్టుపెట్టె తీశాడు. అందులో పసుపు కుంకుమ పొట్లాల మధ్య మంగళసూత్రాలు భద్రంగా వున్నాయి. వాటిని తీసి రెండు చేతులతో ముఖానికి అద్దుకున్నాడు. కన్నీటితో వాటిని కడిగాడు. పెద్ద నిట్టూర్పు విడిచాడు.

ఆ మంగళ సూత్రాలు గంగన్న మొదటి భార్య సూరమ్మవి. సూరమ్మ అంటే గంగన్న దృష్టిలో దేవత. అంత గొప్ప మనసుగల మనిషి లేదని అతని నమ్మకం.

పదేళ్ళ క్రిందట మాయజ్వరం వచ్చి సూరమ్మను ఎత్తుకు పోయింది. సూరమ్మ పోయిన తర్వాత గంగన్నకు లోకంలో అంతా చీకటే కన్పించింది. ఏదీ పట్టించుకునేవాడు కాదు. తాను తన దేవత వెనకాలే పోతాననేవాడు.

బంధువులూ, వూళ్ళోవాళ్ళూ చెప్పగా చెప్పగా, సూరమ్మ విడిచి పోయిన కుర్రాణ్ని పాడుచేసుకుంటావా అని అందరూ మందలించగా గంగన్న మామూలు మనిషయ్యాడు.

ఆ తర్వాత పెద్దల పట్టుమీద రెండో సంబంధానికి ఒప్పుకుని నాగమ్మను చేసుకున్నాడు. రెండో భార్యను బాగానే ఏలుకుంటున్నాడు.

కాని సూరమ్మను మరిచిపోలేను. మరిచిపోలేడు కూడా. తనమీద సూరమ్మ కుండే అభిమానం తలుచుకుని అలాంటి మనిషి మరి పుట్ట దంటాడు. సూరమ్మ జబ్బులో వుండగా భర్తను పిలిచి 'నా అంత పుణ్యం ఎవరికుంటుంది?..... మీ కాళ్ళ దగ్గర ఇంత హాయిగా ప్రాణం వదలడం, నా అదృష్టం. ముత్తయిదువుగా నన్ను ఆ లోకానికి పంపు తున్న యీ మంగళసూత్రాలు చాలా గొప్పవి. నేవెళ్ళిపోయాక వాటిని

భద్రంగా వుంచి ఎప్పుడన్నా వాటిని చూసినప్పుడు మీ సూరమ్మను ఒకసారి తలుచుకోండి. ఇవి ముత్తయిదువు సూత్రాలు.... దేవుడితో సమానం— మన కుర్రాణ్ని ప్రాణంగా చూసుకోండి' అని చెప్పింది. గంగన్న ఆ మాటలు తలుచుకున్నప్పుడు చిన్నపిల్లవాడిమాదిరి ఏడుస్తాడు—

కొంత సేపటికి సంబాళించుకున్నాడు గంగన్న. పెట్టె అడుగున వున్న సంచిలోనుంచి కొంత పైకం లెక్కపెట్టి తీసుకున్నాడు. పెట్టె వేసేశాడు. పంచెతో ముఖం తుడుచుకుని బయటకొచ్చాడు.

వెళ్తున్నానని నాగమ్మతో చెప్పి యజమాని యింటికి వెళ్ళాడు. ఆ డబ్బు రత్తయ్య కిచ్చేశాడు.

తర్వాత ఒకనాడు బజార్లో పోతుండగా రత్తయ్య కన్పించాడు శంకరం పంతులు రత్తయ్య అడగకపోయినా 'రెండు మూడు రోజుల్లో జీతం వస్తుంది .. రాగానే సర్దుతాను' అన్నాడు శంకరం.

రత్తయ్య 'అదేమిటండీ!.... గంగన్న మీ తాలూకు పైకం పట్టుకొచ్చి యిచ్చేశాడే.... మీబాకీయేమీలేదు.' అని ముందుకు సాగిపోయాడు.

శంకరం పంతులుకు ఆశ్చర్యం కలగడం సహజమే. ఇంటికి వెళ్ళి భార్యను అడిగాడు. ఆవిడ నాకేమీ తెలియదనంది.

గంగన్నే యిచ్చాడనుకున్నారు ఆ దంపతులు.

జీతం వచ్చాక డబ్బు తీసుకువెళ్ళి గంగన్నకు ఇవ్వబోయాడు శంకరం. గంగన్న పుచ్చుకోలేదు.

'అది మా సూరమ్మ ఆజ్ఞ... ఆ డబ్బు నేను తిరిగి ముట్టకూడదు' అన్నాడు గంగన్న.

కాని శంకరం తీసుకోక తప్పదన్నాడు.

'బాబుగారూ! మీకు తెలియదండి మా సూరమ్మ ఆజ్ఞంటే

ఏమిటో.... ఆ డబ్బుతో శాంతమ్మగారికి చీరకొనియివ్వండి మా సూరమ్మ పేర' అని కోరాడు.

సూరమ్మ గురించి తెలుసు శంకరానికి.

గంగన్న చెప్పినట్టే శాంతమ్మకు చీరకొన్నాడు ఆ డబ్బుతో శంకరం. గంగన్నను పిలుచుకొచ్చి చీర చూపించాడు.

శాంతమ్మ ఆ చీర కట్టుకొచ్చింది. గంగన్న ఆమెకు నమస్కరించాడు. 'క్షమించండమ్మా! ఆనాడు మీ మంగళసూత్రాలు వూడదీయించాను పాపిష్టి వాణ్ని,' అన్నాడు.

'ఇందులో నీతప్పేముంది గంగన్నా' అంది శాంతమ్మ.

'ఆ సంగతి మీకు తెలియదులెండి' అని గంగన్న సెలవు తీసుకున్నాడు.

అందులో గంగన్న అంతగా బాధపడడానికి కారణం ఆ దంపతులకు సరిగా అర్థం కాలేదు. *

(1964)